అఖండ మెజార్టీతో గెలిపించాలి

కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి గ్రామంలో ప్రచారం చేస్తున్న మాధవరం కృష్ణారావు







కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ప్రజా ఆశీర్వాద ర్యాలీలో పాల్గొన్నారు. తన స్వంత గ్రామమైన కూకట్‌పల్లిని నేడు అన్ని రకాలుగా తీర్చిదిద్దానన్నారు. ఒకప్పుడు కూకట్‌పల్లిలో మహిళలు మంచినీటి కోసం బిందెలతో నిలబడి నానా అవస్థలు పడేవారని నేడు ఆ పరిస్థితి లేకుండా నియోజకవర్గంలోని తొమ్మిది డివిజన్లకు లక్షల్లో గ్యాలన్లతో నీటి ట్యాంకులు నిర్మించడమే కాకుండా భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బంది లేకుండా భూగర్భ నీటి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టామన్నారు. పదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలతో తెలంగాణ రాష్ట్రాన్ని ముందు వరుసలో నిలిపారని అన్నారు.

◆ నేడు శాంతి భద్రతలకు కేరాఫ్ అడ్రస్‌గా హైదరాబాద్ మారిందన్నారు. ప్రపంచంలో ఉన్న అతి పెద్ద కంపెనీలు హైదరాబాద్‌లో తమ పెట్టుబడులు పెట్టి ఇక్కడున్న యువతకు అనేక ఉద్యోగాలు కల్పిస్తున్నాయని తెలిపారు. అదే విధంగా దేవాలయాలు, మసీదులు, చర్చిల పునర్నిర్మాణం, అభివృద్ధి చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో తనకు అఖండ మెజార్టీ చేకూరేలా కారు గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు..

బాలాజీనగర్‌లోని పలువురు వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్ నాయకుడు చున్నూ పాషా ఆధ్వర్యంలో ఆదివారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కృష్ణారావు సతీమణి ఎన్నికల ప్రచారం...

కేపీహెచ్‌బీ డివిజన్‌లో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి డివిజన్‌లోని 6, 9 ఫేజుల్లో, వసంత్‌నగర్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావు గెలుపుకై ఆయన సతీమణి లక్ష్మీబాయి ఇంటింటి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బ్యాలెట్ 2 సంఖ్యపై ఓటు వేయాలని తిరిగి మాధవరం కృష్ణారావుకు అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కేవలం నాలుగు రోజులు మాత్రమే ఎన్నికలకు సమయం ఉందని ప్రతి ఒక్కరు అభివృద్ధికే పట్టం కట్టాలన్నారు. జరిగిన అభివృద్ధి కళ్ల ముందు కనబడుతోందని, తిరిగి కులాల కుమ్ములాటలతో పబ్బం గడుపుకునే పార్టీలకు కాకుండా అందరినీ సమదృష్టిగా చూసే బీఆర్‌ఎస్ పార్టీకి పట్టం కట్టాలన్నారు.

మాధవరం కృష్ణారావుకు పలు సంఘాల మద్దతు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని వైఎస్సార్ అభిమాన సంఘానికి చెందిన నాయకులు ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావును ఆహ్వానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ అభిమాన సంఘం వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పది సంవత్సరాల్లో కుల, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా అందరిని సమానంగా చూసి తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి చేశారని తెలిపారు. అన్ని వర్గాల వారిని తమ ప్రాంతం వారిగా గౌరవించారన్నారు. అదే విధంగా కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా అండదండగా ఉండే నాయకులు అన్నారు. అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన మాధవరం కృష్ణారావు స్థానికంగా ఉండి అందరికీ అందుబాటులో ఉండే మాధవరం కృష్ణారావుకి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కటిక శ్రీనివాస్‌రెడ్డి, ఈవీ జగదీశ్వర్, బాబు రెడ్డి, ఆర్‌కె. కరుణాకర్ రెడ్డి, బీరం జై చంద్రారెడ్డి, కరుణ, కంభం భాస్కర్ రెడ్డి, ముద్దునూరి నాగరాజు, హాస్టల్స్ శ్రీనివాస్‌రెడ్డి, మణిపాల్ రెడ్డి, మనోహర్ రెడ్డి, లోమడ రమేష్ రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

◆ **బిహార్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు..**

మాధవరం కృష్ణారావు గెలుపు కోసం తమ వంతు పాత్ర పోషిస్తామని బిహార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిరాంసింగ్ అన్నారు. ఆదివారం ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిహారీలు కారు గుర్తుకే ఓటు వేస్తామని హామీ ఇచ్చారు. అసోసియేషన్ ప్రతినిధులు ఉత్తమ్ యాదవ్, ప్రబాస్, వినోద్, మహేందర్ సింగ్, భరత్‌సింగ్, దినేష్ సింగ్, దీపక్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **బీఆర్‌ఎస్‌లో చేరిన అంజయ్యనగర్ యువత**

అంజయ్యనగర్ యూత్ అసోసియేషన్ అంజీ ఆధ్వర్యంలో వంద మంది యువకులు మక్కాల నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అసోసియేషన్ నుంచి వంద మంది యువకులం మాధవరం కృష్ణారావు గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు.

గొల్ల కుర్మల మద్దతు కృష్ణారావుకే...



ఓల్డ్‌బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి మాధవరం కృష్ణారావుకు హ్యాట్రిక్ విజయాన్ని అందించి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని గొల్లకుర్మలు తీర్మానం చేశారు. ఆదివారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేట చెరువు కట్టపై కనకరాజుయాదవ్, దుబాయి మల్లేష్, కుంటన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గొల్లకుర్మ ఆత్మీయ సమ్మేళనంలో గొల్లకుర్మలు ఐక్యతగా మాధవరం కృష్ణారావును గెలిపిస్తామన్నారు. సమ్మేళనంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్, మక్కాల నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

రేపు నిధి ఆప్కే నిఖత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో నిధి ఆప్కే నిఖత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈనెల 28న ఉదయం 9 గంటలకు రంగారెడ్డి జిల్లాకు చెందిన ఖాతాదారులు మూసాపేటలోని పంచశీల స్కూలులో, మేడ్చల్ జిల్లాకు చెందిన ఖాతాదారులు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని బస్ టెర్మినల్‌లోని రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉంటుందని ఆయన అన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌ఈఎల్, జీడిమెట్ల, సనత్‌నగర తదితర ఖాతాదారులు పాల్గొనవచ్చని అన్నారు.

హరిహర క్షేత్రంలో కార్తీకమాస పూజలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న భక్తులు

మూసాపేట: భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో ఆదివారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, లక్ష దీపోత్సవం పూజలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు కృష్ణసూరి సమక్షంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అదే విధంగా సోమవారం కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా ఉదయం 5గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, సామూహిక అభిషేకాలు ఉంటాయని తెలిపారు.



మీ అందరికీ అండగా ఉంటా

కూకట్‌పల్లి జనసేన అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్



తూర్పు కాపు వెల్ఫేర్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో ముమ్మారెడ్డి ప్రేమకుమార్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట డివిజన్ గూడ్స్‌షెడ్ రోడ్డులోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో తూర్పు కాపు వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అందరూ కలిసి మెలిసి ఉంటూ అన్ని సామాజికవర్గాల వారిని గౌరవించుకుంటూ పోతే రాజ్యాధికారం దక్కుతుందన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది.

◆ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరిని బెదిరిస్తున్నారని ఈసారి మీ అందరికి అండగా నేనుంటానని భరోసానిచ్చారు. అందరూ గాజు గ్లాసు గుర్తు మీద ఓటు వేసి మీ అమూల్యమైన ఓటును వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గేదల శ్రీను బాబు, బోలిశెట్టి శ్రీనివాస్, బాబీ, మూసాపేట కార్పొరేటర్ మహేందర్, బొశెట్టి నరసింగ రావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జల్లు హేమసుందర్, జాతీయ కాపు అధ్యక్షులు పీసీసీ చంద్రమోహన్, ప్రసాద్, కిషోర్‌కుమార్, కలమట గోపీనాథ్, పోరెడ్డి యోగేశ్వరరావు, కొల్లి వెంకట్, కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే 26 కులాలకు న్యాయం చేస్తాం

జనసేన అధినేత పవన్ కళ్యాణ్

కూకట్‌పల్లి: నిబద్ధతతో పనిచేస్తూ మనం ముందుకు సాగుదాం అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఆదివారం కూకట్‌పల్లి మెట్రో ట్రక్ పార్కులో ఏర్పాటు చేసిన సభలో పవన్ కళ్యాణ్ పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో బీసీ ముఖ్యమంత్రి కాబోతున్నారని పేర్కొన్నారు. 26 కులాలకు బీసీ స్టేటస్ తీసేశారని.. అధికారంలోకి రాగానే 26 కులాలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. కూకట్‌పల్లి ప్రజలు గాజుగ్లాసు గుర్తుకు ఓటు వేసి ముమ్మారెడ్డి ప్రేమకుమార్‌ను గెలిపించాలని కోరారు.

వైభవం... లక్ష దీపోత్సవం

భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో ఆదివారం కార్తీక పౌర్ణమి సందర్భంగా లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.
– మూసాపేట







అతిపెద్ద రాజ్యాంగం.. గర్వకారణం

వెంగళరావునగర్: భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్దదని, దానిని పగడ్బందీగా అమలు చేస్తుండటం మనకెంతో గర్వకారణమని టీఎస్ఎస్‌పీ ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ అన్నారు. యూసుఫ్‌గూడలోని టీఎస్ఎస్‌పీ మొదటి పటాలంలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నరేందర్‌సింగ్, ఆర్ఐలు ధర్మారావు, సాంబయ్య, శంకర్, జాఫర్, రవీందర్, రాజేశం, నర్సయ్య, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిపై దుష్ప్రచారం

● సైబర్ క్రైమ్ పోలీసులకు ఎన్‌ఎస్‌యూఐ నేతల ఫిర్యాదు

హిమాయత్‌నగర్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ... బీఆర్‌ఎస్ నేతలు ఈ ఎన్నికల్లో గెలవలేమని, సోషల్ మీడియాలో రేవంత్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ రీసర్చ్ స్కాలర్ కంచర్ల రమేష్‌రెడ్డి పేరుతో రేవంత్‌రెడ్డిపై అసత్య ప్రచారం చేస్తున్నారు. అసత్యాలను ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను ఓర్వలేక ఈ విధంగా ప్రచారం చేస్తున్నారన్నారు.

సంపులోపడి మహిళ మృతి

● అనుమానాస్పద మృతిగా పోలీసుల కేసు నమోదు

బంజారాహిల్స్: నీటి సంప్‌లో పడిన మహిళ మృతి చెందిన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... నాగర్‌కర్నూల్ జిల్లా గంగారం గ్రామానికి చెందిన కవిత(21) వివాహం మూడు నెలల క్రితం ముత్తిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన విష్ణుతో జరిగింది. వారిద్దరూ కలిసి బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని ఉదయ్‌నగర్‌లో గది అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. విష్ణు యూ ట్యూబ్ చానెల్‌లో పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం యథావిధిగా డ్యూటీకి వెళ్లాడు. సాయంత్రం 6 గంటల ప్రాంతంలో పక్కింట్లో ఉండే ఓ మహిళ కవిత ఇంటికి రాగా ఇంట్లో కనిపించలేదు. దాంతో విష్ణుకు కాల్ చేసి చెప్పింది. ఇంటికి తిరిగి వచ్చిన విష్ణు స్థానికుల సాయంతో వెతకగా అదే ఇంటి గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న సంప్‌లో కవిత మృతదేహం కనిపించింది. ప్రమాదవశాత్తు కిందపడి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

బలహీనవర్గాలకు బీజేపీ అండ: మంద కృష్ణ మాదిగ

శ్రీనగర్‌కాలనీ: బలహీనవర్గాలకు అండగా నిలిచేది బీజేపీ మాత్రమే అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం రాత్రి ఎస్‌పీఆర్ హిల్స్‌లో బీజేపీకి మద్దతుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నేతలు కిలారి మనోహర్, ఆలపాటి లక్ష్మీనారాయణ, బాలకృష్ణ మోహన్, కుంబాల గంగరాజు, ప్రేమ్ పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే హామీలన్నీ అమలు చేస్తాం

కర్ణాటక మంత్రి జావేద్ హైమత్



అబ్రహార్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ప్రచార సభలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్



కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న లకుమాదేవి

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో అబ్రహార్ నగర్‌లో కర్ణాటక రోడ్డు రవాణ శాఖ మంత్రి జావేద్ హైమత్ ఖాన్, శివాజీనగర్ ఎమ్మెల్యే రిజ్వాన్ హైమత్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి ఆధ్వర్యంలో అబ్రహార్‌నగర్‌లో జరిగిన ప్రచార సభలో వారు పాల్గొని కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇచ్చిన హామీలు అమలు చేస్తామన్నారు. ఈ ప్రచారంలో నాయకులు మల్లికార్జున యాదవ్, సత్యం శ్రీరంగం, అస్లాం, నల్లోల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బండి రమేష్ సతీమణి లకుమాదేవి ప్రచారం..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి రమేష్ సతీమణి లకుమాదేవి ఆదివారం కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలో తనదైన శైలిలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల కరపత్రాలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి బండి రమేష్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

ఇండిస్ వన్ సిటీ, లోధా మెరిడియన్ రెసిడెంట్స్‌తో మీట్ అండ్ గ్రీట్

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ డివిజన్‌లోని ఇండిస్ వన్ సిటీ, లోధా మెరిడియన్ రెసిడెంట్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ మార్పు మొదలైంది.. మీ తీర్పు మిగిలింది కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్‌ను ఆహ్వానించి మద్దతు తెలిపారు. అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తాను గెలిచిన తర్వాత కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఉన్న సమస్యలు, అసోసియేషన్‌కు సంబంధించిన సమస్యలన్నిటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు ఎర..

● పెరిగిన ప్రలోభాల జోరు
● నగర శివారు హోటళ్లు, రిసార్టుల్లో ఆత్మీయ సమ్మేళనాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికలకు మరో మూడు రోజులు మాత్రమే ఉంది. ఈ కొద్ది సమయం అన్ని పార్టీల అభ్యర్థులకు ఎంతో కీలకం. ఎలాగైనా ఓటర్లను తమ వైపు తిప్పుకోవాలని బహుముఖ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ప్రత్యర్థుల కంటే ముందే ఆకట్టుకోవాలనే లక్ష్యంతో జిల్లాలో అన్ని పార్టీలు ప్రలోభాలకు తెరతీశాయి. బస్తీలు, వార్డులు, డివిజన్లు, కాలనీలు, అపార్టుమెంట్లు, గ్రామాలు, సామాజిక వర్గాల వారీగా తాయిలాలు ప్రకటిస్తూ వారికి కావాల్సింది చేస్తూ.. ఓటర్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. పోటాపోటీగా సభలు, రోడ్డు షోలు, పాదయాత్రలకు విచ్చలవిడిగా డబ్బులు వెదజల్లి జనాలను సమీకరిస్తున్నారు. సాయంత్రం అయ్యే సరికి ఎవరెవరికి ఏమేమి అవసరమో సమకూరుస్తున్నారు. బిర్యానీ పొట్లాలు, మందు సీసాలు విరివిగా లభిస్తున్నాయి. తాయిలాలు సమకూరుస్తూ విజయం తమదేనంటూ అభ్యర్థులు ఎవరికి వారు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు.

ఆత్మీయ సమ్మేళనాలు.. చేరికలు

జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 126 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు కాస్తో కూస్తో ప్రభావం చూపించే చిన్న పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు బరిలో ఉన్నారు. దీంతో పోటీ తీవ్రత పెరిగింది. ఈ నేపథ్యంలో ఎవరికి వారు గెలవాలనే పట్టుదలతో అందివచ్చిన అవకాశాలను వినియోగించుకుంటున్నారు. నగర శివారుల్లోని హోటళ్లు, రిసార్టులు, కమ్యూనిటీ హాళ్లలో సామాజికవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. మీకేం కావాలో చెప్పండి.. మీ వర్గం ఓట్లన్నీ మాకే వేయండి.. అంటూ తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. హాజరైన వారందరికీ బిర్యానీ వంటి రుచికర భోజనాలు వడ్డిస్తున్నారు. అలాగే.. ఇతర పార్టీ నుంచి వారి పార్టీలోకి వచ్చి కండువా వేసుకునే వారి లెక్కలు వేరేగా ఉన్నాయి. ద్వితీయ శ్రేణి నాయకులు ముందుగా వారితో చర్చలు కండువాలు వేయించి, రూ.వేలు ముట్టచెబుతున్నట్లుగా సమాచారం. పార్టీల అభ్యర్థులు బలంగా ఉన్న చోట ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు రూ.కోట్లు ఖర్చు చేసేందుకు వెనుకాడటం లేదనేది వినిపిస్తున్న మాట.

తాయిలాలు అందజేస్తూ..

ఇంటింటికీ పార్టీ గుర్తు బ్యాలెట్ పేపరుతో పాటు క్యాలెండర్లు, క్రికెట్ ఇతర ఆటల సామగ్రి అందజేసేందుకు ఒప్పందాలు కుదుర్చుకొని వారికి అందజేస్తున్నారు. ప్రచారం కోసం వచ్చే వారికి రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు అందజేస్తున్నారు. రాత్రివేళ మద్యం సీసాలు పంపిస్తున్నారు. పలువురు అభ్యర్థులు ఓటుకు నోటు, మద్యం సీసాలు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.

8వ బెటాలియన్‌లో రాజ్యాంగ దినోత్సవం

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని, పరిపూర్ణమైన విశ్వాసాన్ని కలిగి ఉంటామని అదనపు కమాండెంట్ కె సుబ్రహ్మణ్యం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ పౌరులంతా క్రమశిక్షణ, వినయ పూర్వకంగా ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అపర్ణా సైబర్‌జోన్‌లో ఆకట్టుకున్న ఆర్ట్ గ్యాలరీ

శేరిలింగంపల్లి: అనుగ్రజా ఆర్ట్స్ స్టూడియో ఆధ్వర్యంలో అపర్ణా సైబర్‌జోన్‌లో ఏర్పాటు చేసిన ఆర్ట్‌గ్యాలరీని డీసీపీ శిల్పవల్లి ప్రారంభించారు. చిన్నారుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ అవసరమన్నారు. చిన్నారులు ముఖ్యంగా ఆర్ట్ పట్ల ఆసక్తి కనబరిస్తే ఆ రంగంలో రాణించేలా వారిని ప్రోత్సహించాలన్నారు. ఆర్ట్ సంస్థలు ముందుకొచ్చి ఇలాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేస్తే చిన్నారులకు వేదికలాగా ఉపయోగపడుతుందన్నారు. 69 మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. కార్యక్రమంలో ప్రముఖ కళాకారుడు శిల్పి శేషబ్రహ్మం, అమృత ఫౌండేషన్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ దేవికారాణి, డాక్టర్ ప్రియ, తిరుమల ప్రసూన మురళి, స్టూడెంట్ కౌన్సిలర్ పద్మారాణి పాల్గొన్నారు.

అలరించిన ‘బ్రింగ్ యువర్ కిడ్స్ టు వర్క్ డే’

రాయదుర్గం: నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని ఏడీపీ ఇండియా ఐటీ సంస్థలో ‘బ్రింగ్ యువర్ కిడ్స్ టు వర్క్ డే’ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఐడీపీ సంస్థ అసోసియేట్లు, తమ పిల్లలతో కలిసి రావడంతో సందడిగా మారింది. ఈ కార్యక్రమాన్ని ఏడీపీ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్, మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ వేములపల్లి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన పని-జీవిత సమతుల్యతకు విలువనిచ్చే వాతావరణంను ఏడీపీ విశ్వసిస్తుందన్నారు. అనంతరం చిన్నారులకు పలు రకాల పోటీలను నిర్వహించి బహుమతులను అందించారు.

రాహుల్‌గాంధీని కలిసిన హెచ్‌సీయూ బృందం

రాయదుర్గం: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని గచ్చిబౌలిలోని ఆలిండియా ఓబీసీ విద్యార్థుల అసోసియేషన్ బృందం నగరంలో ఆదివారం కలిసింది. ఏఐఓబీసీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలోని బృందం రాహుల్‌గాంధీని కలిసి 16 అంశాలతో కూడిన ఓబీసీ డిక్లరేషన్‌ను అందించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ తాము అధికారంలోకి వస్తే బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు. ఏఐఓబీసీఎస్ఏ జాతీయ కార్యదర్శి సాయి కిరణ్, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కొండల్ లక్ష్మీనర్సయ్య, ప్రవీణ్‌రాజు, మురళీయాదవ్ పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధనోత్సవాలు

మాదాపూర్ : శిల్పారామంలో సిద్దేంద్రయోగి ఆరాధనోత్సవాల ముగింపు కార్యక్రమంను డాక్టర్ శ్రీనివాస వర ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్సవాలలో దాదాపుగా 250 మంది కళాకారులు పాల్గొన్నారు. కళింగ నర్తన తిల్లాన, నమో నమో, శివాష్టకం, భామాకలాపం, బాలగోపాల అంశాలను ప్రదర్శించారు. ప్రముఖ నాట్యకారులు శ్రీ కళాకృష్ణ, మిమిక్రి ఆర్టిస్ట్, సినీ ఆర్టిస్ట్ శివారెడ్డి విచ్చేసి కళాకారులకి జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు ఇచ్చి సత్కరించారు.

బీఆర్‌ఎస్ పేదల పార్టీ కాదు.. పెద్దల పార్టీ

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్‌కు ఓటు వేస్తే బీఆర్‌యస్‌కు వేసినట్లేనని శేరిలింగంపల్లి నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు భిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఆల్విన్‌కాలనీ ఫేజ్ వన్‌లో పార్టీ సీనియర్ నాయకుడు వెంకటస్వామిరెడ్డి, యాదవరెడ్డిల ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి రవికుమార్ యాదవ్‌ను గెలిపించాలని కోరారు. భారత ప్రధాని మోదీ భారతదేశాన్ని ప్రపంచంలో నెంబర్ వన్‌గా నిలబెట్టారని, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే బీజేపీ ద్వారా సాధ్యమవుతుందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు భిక్షపతియాదవ్ సమక్షంలో బీజేపీలో చేరారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలపై కేసులు నమోదు

హిమాయత్‌నగర్: పరస్పర ఫిర్యాదుల మేరకు బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులపై నారాయణగూడ పోలీసులు కేసులు నమోదు చేశారు. నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ సమాచారం మేరకు... నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని విఠల్‌వాడి ప్రాంతంలో బీజేపీ నేతలు డబ్బులు పంచుతున్నారని బీఆర్‌ఎస్ నేతలు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. బీజేపీ అభ్యర్థి చింతల రాంచందర్‌రెడ్డి తరఫున ఓటర్లకు డబ్బు పంచుతున్నారని వారు ఫిర్యాదు చేశారు. బీజేపీ అధికార ప్రతినిధి అమర్‌నాథ్‌పై బీఆర్‌ఎస్ నాయకుడు కార్పొరేటర్ భర్త రామన్‌గౌడ్ మరో నలుగురు కలిసి దాడి చేశారని బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదుల పై కేసులు నమోదు చేశామని, బీజేపీ వారు ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని బీఆర్‌ఎస్ నేతలు అప్పగించిన నగదు రూ. 18500లను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశామని తెలిపారు. ఈ కేసు పై తదుపరి విచారణ ఆర్‌ఓ తీసుకుంటారని తెలిపారు. బీజేపీ అధికార ప్రతినిధి అమర్‌నాథ్ పై దాడి చేసిన బీఆర్‌ఎస్ నాయకుడు రామన్‌గౌడ్‌తో పాటు మరో నలుగురు నాయకులపై కేసు నమోదు చేసి 41 సీఆర్‌పీసీ నోటీసు ఇచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.